# ఢిల్లీలో తెలుగు నేతల విందు..

- కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ ఆతిథ్యంలో అల్పాహార భేటీ
- పాల్గొన్న ముఖ్యమంత్రి, కేంద్ర మంత్రులు, ఎంపీలు
- హైదరాబాద్‌కు ఈవీ బస్సులు ఇవ్వాలని రేవంత్ విజ్ఞప్తి
- 2029 నాటికి మహిళా రిజర్వేషన్లపై మంత్రి కీలక వ్యాఖ్యలు
- ఈ కలయికలో ఎలాంటి రాజకీయ కోణం లేదని వెల్లడి

02




KANCHARLA

# మనసులోమాట

నిజమే మా ఇజం.. అదే మా జర్నలిజం.. సంచలన తెలుగు దిన పత్రిక

## తెలంగాణ

| | | | | |
|---|---|---|---|---|
| హైదరాబాద్ | రంగారెడ్డి | మహబూబ్ నగర్ | మెదక్ | నల్గొండ |
| నిజామాబాద్ | ఆదిలాబాద్ | కరీంనగర్ | వరంగల్ | ఖమ్మం |

ఆదివారం 19 ఏప్రిల్ 2026 పేజీ : 1




# అది బీజేపీ విధానాల ఓటమే

## మహిళా బిల్లు ముసుగులో దక్షిణాదిపై కుట్ర!

### డీలిమిటేషన్ పేరుతో దగా చేయాలని చూశారు

### లోక్‌సభ సాక్షిగా ఆ కుట్రను అడ్డుకున్నాం

- చిత్తశుద్ధి ఉంటే కేవలం మహిళా బిల్లు తీసుకురావాలి
- ఆ బిల్లుకు 'ఇండియా' కూటమి బేషరతు మద్దతు ఇస్తుంది
- విపక్షాల ఐక్యతతోనే మోదీ సర్కార్‌కు ఓటమి
- బీజేపీతో పొత్తు పెట్టుకున్న పార్టీల భవిష్యత్తు గల్లంతే
- టీడీపీ, చంద్రబాబుకు సైతం ముప్పు తప్పదు: సీఎం రేవంత్ రెడ్డి

మహిళా రిజర్వేషన్ బిల్లు ముసుగులో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దక్షిణాది రాష్ట్రాలపై పెను కుట్రకు తెరలేపిందని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. డీలిమిటేషన్ పేరుతో దక్షిణ భారతానికి అన్యాయం చేయాలని చూశారని, లోక్‌సభ సాక్షిగా ప్రతిపక్షాల ఐక్యతతో ఆ కుట్రను సమర్థవంతంగా అడ్డుకున్నామని స్పష్టం చేశారు. న్యూఢిల్లీలో మీడియాతో మాట్లాడిన ఆయన మోదీ సర్కార్ తీరును తీవ్రంగా ఎండగట్టారు. ఇదే సమయంలో కేంద్రంలో మిత్రపక్షంగా ఉన్న టీడీపీ అధినేత చంద్రబాబు పరిస్థితి భవిష్యత్తులో దారుణంగా మారక తప్పదని తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు.

వివరాలు 2లో..

## రామచంద్రరావు గృహనిర్బంధం!

- మహిళా బిల్లుపై కాంగ్రెస్ తీరుకు నిరసన
- రేవంత్ నివాసం ముట్టడికి పిలుపు..
- నారీశక్తికి ద్రోహం చేసింది: బీజేపీ
- ముస్లింల కోసమే ఈ నాటకాలు
- రాష్ట్రవ్యాప్త ఆందోళనలకు కమలనాథుల పిలుపు

02




## కేసీఆర్ వస్తుంటే.. గుంటనక్కలకు వణుకు!



- రాష్ట్రంలో మొదలైన రాజకీయ పునరేకీకరణ: కేటీఆర్
- పార్టీకి పూర్వ వైభవం రావడం ఖాయమన్న వర్కింగ్ ప్రెసిడెంట్
- సీఎం రేవంత్ ది 'చిన్న మెదడు' అంటూ ఘాటు విమర్శలు
- జగిత్యాలలో ప్రజా ఆశీర్వాద సభ ఏర్పాట్ల పరిశీలన

వివరాలు 3లో..

## పులి బయటకు వస్తే.. పాపాలు బయటపెడతాం!

- కాళేశ్వరంలో 'పులి' ఏం మింగిందో వివరిస్తాం
- కేసీఆర్ జగిత్యాల సభపై మహేష్ కుమార్ గౌడ్ ఫైర్



06

## మహిళా బిల్లు అడ్డుకోవడం చారిత్రక తప్పిదం!

- విపక్షాలు మహిళా ద్రోహులుగా మిగిలిపోతారు:
- దక్షిణాదికి మేలు చేసే ఫార్ములాను అడ్డుకున్నారు
- కాంగ్రెస్ ది మహిళా వ్యతిరేక వైఖరి అని విమర్శ
- కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

06

# అది బీజేపీ విధానాల ఓటమే

- మహిళా బిల్లు ముసుగులో దక్షిణాదిపై కుట్ర!
- డీలిమిటేషన్ పేరుతో దగా చేయాలని చూశారు
- లోక్‌సభ సాక్షిగా ఆ కుట్రను అడ్డుకున్నాం
- సీఎం రేవంత్ రెడ్డి

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 18 (మనసులో మాట):** మహిళా రిజర్వేషన్ల బిల్లు పేరుతో డీలిమిటేషన్ బిల్లును తీసుకొచ్చి.. తద్వారా దక్షిణాది రాష్ట్రాలను దెబ్బతీసే కుట్రను కేంద్ర ప్రభుత్వం చేసిందని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి విమర్శించారు. లోక్‌సభ సాక్షిగా తాము ఈ కుట్రను అడ్డుకున్నామని స్పష్టం చేశారు. ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. మహిళా బిల్లు వీగిపోవడంతో బీజేపీ నేతలు ప్రతిపక్షాలపై అసత్య ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. మహిళల సంక్షేమానికి కాంగ్రెస్ పార్టీ ఎంతో కృషి చేసిందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. మహిళా బిల్లు వీగిపోవడం రాజకీయ ఓటమి కాదని, అది పూర్తిగా బీజేపీ విధానాల ఓటమిగా భావించాలని రేవంత్ రెడ్డి అన్నారు. ఈ బిల్లు పట్ల ప్రధాని నరేంద్ర మోదీకి ఏమాత్రం నిజాయితీ లేదని ధ్వజమెత్తారు. ఒకవేళ నిజాయితీగా మహిళా రిజర్వేషన్ బిల్లును మాత్రమే సభకు తీసుకువచ్చి ఉంటే, పార్లమెంట్‌లో ఉన్న అందరూ ఏకగ్రీవంగా మద్దతు తెలిపేవారని అన్నారు. కానీ మహిళా బిల్లు ముసుగులో డీలిమిటేషన్ బిల్లును చొప్పించి దక్షిణాదికి తీరని అన్యాయం చేయాలని చూశారని మండిపడ్డారు. ప్రధాని మోదీ.. ఉత్తర, దక్షిణ భారత రాష్ట్రాల మధ్య అంతరాలు సృష్టించే ఇటువంటి విధానాలను తక్షణమే విరమించుకోవాలని డిమాండ్ చేశారు.



## బేషరతుగా మద్దతు ఇస్తాం

మహిళా రిజర్వేషన్ల బిల్లుపై తమకు పూర్తి చిత్తశుద్ధి ఉందని, దీనిపై రాజకీయం చేయాల్సిన అవసరం లేదని సీఎం స్పష్టం చేశారు. 2023 నాటి మహిళా బిల్లును యథాతథంగా పార్లమెంట్‌లో పెడితే, ఇండియా కూటమి బేషరతుగా మద్దతు ఇచ్చేందుకు సిద్ధంగా ఉందన్నారు. అందులోనూ ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ రిజర్వేషన్లు సైతం పక్కాగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. వాస్తవానికి మహిళా బిల్లు ఇప్పటికే పాసైందని.. చిన్న సవరణలతో రిజర్వేషన్లు అమలు చేయవచ్చన్నారు. కానీ రిజర్వేషన్లు తొలగించేందుకే మూడు బిల్లుల పేరుతో డీలిమిటేషన్ అమలుకు బీజేపీ కుట్ర చేసిందని, వారికి 400 సీట్లు వచ్చి ఉంటే కచ్చితంగా రాజ్యాంగాన్ని మార్చేవారని తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. విపక్షాల ఐక్యతతో మోదీ సర్కార్ కుట్రలు భగ్నమయ్యాయని, ఆ కోపంతోనే ఇప్పుడు తమపై బురద చల్లేందుకు ప్రయత్నిస్తోందని విమర్శించారు.

## యూపీ ఎన్నికల్లోపు అమలు చేయాలి

2011 జనాభా లెక్కల ప్రకారమే మహిళలకు రిజర్వేషన్లు కల్పించాలని, యూపీ ఎన్నికల్లోపు వాటిని అమలు చేయాలని ముఖ్యమంత్రి డిమాండ్ చేశారు. ఆ బిల్లు తెచ్చేందుకు దక్షిణాది రాష్ట్రాలను ఒప్పించే బాధ్యత తనదేనని రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. అప్పుడే ప్రజల్లో ఎవరికి మద్దతు ఉందో ప్రజాక్షేత్రంలో తేలిపోతుందంటూ సవాల్ విసిరారు. ఒకవేళ నాడు తాము బిల్లును అడ్డుకోకపోయి ఉంటే, డీలిమిటేషన్ పేరుతో దక్షిణాది రాష్ట్రాలకు శాశ్వతంగా అన్యాయం జరిగి ఉండేదన్నారు. నార్త్, సౌత్ మధ్య ఇలాంటి భేదాలు చూపే విధానం ఇకనైనా మార్చుకోవాలని బీజేపీకి హితవుపలికారు.

## మిత్రపక్షాలకు ముప్పు తప్పదు

బీజేపీతో పొత్తు పెట్టుకున్న పార్టీల పరిస్థితి భవిష్యత్తులో అత్యంత కష్టంగా మారుతుందని రేవంత్ రెడ్డి హెచ్చరించారు. నితీష్ కుమార్, ఏక్‌నాథ్ షిండేల పరిస్థితి ఏమైందో ఇప్పుడు మనం చూస్తున్నామన్నారు. భవిష్యత్తులో టీడీపీ, చంద్రబాబు నాయుడు పరిస్థితి కూడా అలాగే అవుతుందని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం కేంద్రంలో బీజేపీకి సొంతంగా మెజార్టీ లేదు కాబట్టే టీడీపీకి అత్యంత ఇంపార్టెన్స్ ఇస్తున్నారని వివరించారు. లోక్‌సభ, రాజ్యసభ అనేవి కేవలం చట్టాలు చేయడానికి మాత్రమేనని, కానీ వాటిని క్షేత్రస్థాయిలో ఇంప్లిమెంట్ చేసేది మాత్రం స్థానికంగా ఉండే ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు, అధికారులేనని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. కేవలం 2/3 మెజార్టీ ఉన్నంత మాత్రాన అన్నింటినీ ఇష్టానుసారం చట్టాలు చేసేస్తామంటే కుదరదన్నారు. ప్రధాని హోదాలో ఉంటూ కేంద్రంలో మెజార్టీ ఉందని.. తనకు తానే రాజులాగా డిక్టేటర్‌షిప్‌తో ప్రవర్తిస్తే ఎవరూ ఒప్పుకోరని ఘాటుగా వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా ఏపీ అసెంబ్లీలో ప్రతిపక్షానికి కేవలం 11 సీట్లు మాత్రమే ఉన్నాయన్న విషయాన్ని ఆయన ప్రస్తావించారు.

# బయ్యారంలో 'గ్రీన్ స్టీల్' ప్లాంట్!

- కేంద్ర మంత్రులతో సీఎం భేటీ
- బయ్యారం ఉక్కుపై ప్రతిపాదన
- హైదరాబాద్‌లో స్కిల్ హబ్‌లు
- రాష్ట్ర పారిశ్రామిక విజన్ వివరణ
- ప్రియాంక గాంధీకి రేవంత్ కృతజ్ఞతలు



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 18 (మనసులో మాట):** కేంద్ర మంత్రులు హెచ్ డీ కుమారస్వామి, శ్రీనివాస వర్మలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కలిశారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా బయ్యారంలో గ్రీన్ స్టీల్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయాలని కుమారస్వామికి విజ్ఞప్తి చేశారు. దీని ద్వారా ఉక్కు కొరత తగ్గడంతో పాటు పర్యావరణానికి మేలు జరుగుతుందని తెలిపారు. తెలంగాణ రైజింగ్ 2047 విజన్‌లో భాగంగా రూపొందించిన పారిశ్రామిక ప్రతిపాదనలను ఈ సందర్భంగా సీఎం వివరించారు. పాత వాహనాల స్క్రాప్‌ను రీసైక్లింగ్ చేసే పరిశ్రమను రాష్ట్రంలో ఏర్పాటు చేయాలని కోరారు.

## హైదరాబాద్ అభివృద్ధిపై దృష్టి

ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం పెరుగుతున్న దృష్ట్యా ఈవీ బ్యాటరీ తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని రేవంత్ రెడ్డి విన్నవించారు. ఆటో, రక్షణ రంగాల ఉత్పత్తులు, రోబోటిక్స్ తయారీ కోసం ప్రత్యేక పార్కుల ఏర్పాటును ప్రతిపాదించారు. 2034 నాటికి హైదరాబాద్‌ను కాలుష్య రహిత నగరంగా మార్చేందుకు కేంద్ర సహకారం కావాలని కోరారు. ఆధునిక పరిశ్రమలకు అనుగుణంగా జాతీయ స్థాయి స్కిల్ డెవలప్‌మెంట్ సంస్థలను హైదరాబాద్‌లో నెలకొల్పాలని కేంద్ర మంత్రి కుమారస్వామికి విజ్ఞప్తి చేశారు.

## ప్రియాంక గాంధీతో భేటీ

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శనివారం ఉదయం కాంగ్రెస్ నేత ప్రియాంక గాంధీని కలిశారు. 131వ రాజ్యాంగ సవరణ బిల్లును ఓడించినందుకు ఆమెకు కృతజ్ఞతలు తెలిపారు. మహిళా రిజర్వేషన్ బిల్లు వెనుక ఉన్న అసలు విషయాలను ప్రియాంక గాంధీ బయటపెట్టారని సీఎం పేర్కొన్నారు. తెలంగాణ ప్రజల తరపున రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గేలకు ధన్యవాదాలు తెలియజేశారు. దక్షిణాది రాష్ట్రాలను ఏకీకృతం చేయడంలో రేవంత్ రెడ్డి చేస్తున్న కృషిని ప్రియాంక గాంధీ అభినందించారు.



# ఢిల్లీలో తెలుగు నేతల విందు..

- కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ ఆతిథ్యంలో అల్పాహార భేటీ
- పాల్గొన్న ముఖ్యమంత్రి, కేంద్ర మంత్రులు, ఎంపీలు

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 18 (మనసులో మాట):** తెలుగు రాష్ట్రాల నేతలకు ఆంధ్ర ప్రాంతం నుంచి కేంద్ర మంత్రిగా ఉన్న భూపతిరాజు శ్రీనివాస వర్మ ఆతిథ్యం ఇచ్చారు. శనివారం ఉదయం తెలుగు నేతలందరికీ ఆయన అల్పాహార విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ అల్పాహార విందులో ఎటువంటి రాజకీయ కోణం లేదని స్పష్టం చేశారు. డిసెంబర్ 9 నాటికి హైదరాబాద్ నగరం 'క్లీన్ అండ్ గ్రీన్' గా ఉండాలని, అందుకోసం ఈవీ బస్సులు ఇవ్వాలని సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారని తెలిపారు. ఇప్పటికే ఎలక్ట్రిక్ బస్సుల కేటాయింపులు చేశామని, త్వరలోనే వాటిని అందజేస్తామని మంత్రి వెల్లడించారు.

మహిళా రిజర్వేషన్లు 2029 నుంచి అమలు చేసేందుకు ఒక ప్రయత్నం చేశామని, కానీ విపక్షాలు వ్యతిరేకించాయని ఆయన అన్నారు. 2029 నుంచే మహిళా రిజర్వేషన్లు అమలు కావాలని ఆశిస్తున్నట్లు కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ పేర్కొన్నారు. ఈ అల్పాహార విందుకు కేంద్ర మంత్రులు రామ్మోహన్ నాయుడు, కుమారస్వామి, పెమ్మసాని చంద్రశేఖర్, టీడీపీ ఎంపీలు, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, తెలంగాణ బీజేపీ ఎంపీ లక్ష్మణ్ హాజరయ్యారు. ఏపీ మంత్రి పయ్యావుల కేశవ్, ఏపీ డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజు కూడా ఈ విందులో పాల్గొన్నారు.

# రామచంద్రరావు గృహనిర్బంధం!

- మహిళా బిల్లుపై కాంగ్రెస్ తీరుకు నిరసన
- రేవంత్ నివాసం ముట్టడికి పిలుపు..
- కాంగ్రెస్ నారీశక్తికి ద్రోహం చేసింది: బీజేపీ
- ముస్లింల కోసమే ఈ నాటకాలని విమర్శ
- రాష్ట్రవ్యాప్త ఆందోళనలకు కమలనాథుల పిలుపు

**హైదరాబాద్, ఏప్రిల్ 18 (మనసులో మాట):** తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రామచంద్రరావును పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. లోక్‌సభలో మహిళా రిజర్వేషన్ బిల్లును కాంగ్రెస్ అడ్డుకుందంటూ సీఎం రేవంత్ రెడ్డి నివాసాన్ని ముట్టడించాలని బీజేపీ పిలుపునిచ్చింది. ఈ నేపథ్యంలో శనివారం ఉదయమే రామచంద్రరావు నివాసానికి చేరుకున్న పోలీసులు ఆయనను గృహనిర్బంధం చేశారు. పోలీసుల చర్యపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నారీశక్తికి ద్రోహం చేసిన కాంగ్రెస్‌ను వదిలిపెట్టేది లేదని హెచ్చరించారు.

## కాంగ్రెస్‌కు బుద్ధి చెబుతాం

ఈ సందర్భంగా రామచంద్రరావు మాట్లాడుతూ.. కాంగ్రెస్ వైఖరికి నిరసనగా దేశవ్యాప్త ఆందోళనలకు పిలుపునిచ్చామని తెలిపారు. తనను నిర్బంధించినప్పటికీ బీజేపీ శ్రేణులు, నాయకులు రేవంత్ రెడ్డి ఇంటిని ముట్టడించి తీరుతారని స్పష్టం చేశారు. దేశంలో ఇంకా రాచరిక పాలన కొనసాగాలని కాంగ్రెస్ భావిస్తోందని మండిపడ్డారు. కేవలం ముస్లిం సమాజాన్ని ప్రసన్నం చేసుకునేందుకే కాంగ్రెస్ ఈ నాటకాలు ఆడుతోందని ఆరోపించారు. తెలంగాణ సమాజం కాంగ్రెస్ పార్టీకి తగిన బుద్ధి చెప్పాలని ఆయన కోరారు.

# కేసీఆర్ వస్తుంటే.. గుంటనక్కలకు వణుకు!

- జగిత్యాల నుంచే బీఆర్ఎస్ జైత్రయాత్ర ప్రారంభం
- రాష్ట్రంలో మొదలైన రాజకీయ పునరేకీకరణ: కేటీఆర్
- పార్టీకి పూర్వ వైభవం రావడం ఖాయమన్న వర్కింగ్ ప్రెసిడెంట్



**జగిత్యాల, ఏప్రిల్ 18 (మనసులో మాట):** రాష్ట్రంలో రాజకీయ పునరేకీకరణ ప్రారంభమైందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. కాంగ్రెస్ సీనియర్ నేత జీవన్ రెడ్డి బీఆర్ఎస్ లో చేరుతుండటంతో జిల్లాలో పండుగ వాతావరణం నెలకొందని.. జగిత్యాల నుంచే పార్టీ జైత్రయాత్ర ప్రారంభమవుతుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ నెల 20న జగిత్యాలలో నిర్వహించనున్న కేసీఆర్ 'ప్రజా ఆశీర్వాద సభ' ఏర్పాట్లను మాజీ మంత్రి హరీష్ రావుతో కలిసి ఆయన శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. కేసీఆర్ బయటకు వస్తుంటే 'గుంటనక్కలు' భయపడుతున్నాయని ఎద్దేవా చేశారు. కేసీఆర్ సభకు పోటీగా రేవంత్ రెడ్డి సభలు పెట్టుకుంటున్నారని.. రేవంత్ ది 'చిన్న మెదడు' అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఈ నెల 20న సాయంత్రం 5:30 గంటలకు కేసీఆర్ సభ ప్రారంభమవుతుందని.. సుమారు గంట పాటు సాగుతుందని తెలిపారు.

### తెలంగాణ ఆత్మగౌరవంపై దాడి: హరీష్ రావు

అనంతరం మాజీ మంత్రి హరీష్ రావు మాట్లాడుతూ.. బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య లోక్‌సభలో చేసిన వ్యాఖ్యలు తెలంగాణ ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే విధంగా ఉన్నాయని మండిపడ్డారు. తేజస్వి సూర్య వ్యాఖ్యలకు ఎంపీలు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మద్దతుగా నిలవడం సిగ్గుచేటన్నారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని కించపరిచేలా మాట్లాడితే.. రాష్ట్రం నుంచి ఉన్న ఎనిమిది మంది బీజేపీ, ఎనిమిది మంది కాంగ్రెస్ ఎంపీలు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. బీజేపీ ఎంపీ తక్షణమే తెలంగాణ ప్రజలకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. భారత్ – పాక్ విభజనతో తెలంగాణ ఏర్పాటును పోల్చడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్లమెంట్‌లో బిల్లు పాసై తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందన్న కనీస స్పృహ లేకపోవడం దారుణమన్నారు.

### పార్లమెంట్‌లో బీఆర్ఎస్ ఎంపీల లోటు

బీఆర్ఎస్ ఎంపీలు పార్లమెంట్‌లో లేని లోటు నిన్న స్పష్టంగా కనిపించిందని హరీష్ రావు అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఇప్పటి వరకు ఈ వ్యాఖ్యలను ఖండించకపోవడం ఆయన వైఖరికి నిదర్శనమని విమర్శించారు. రాబోయే రోజుల్లో మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వం రావడం ఖాయమని.. దానికి నిదర్శనమే జీవన్ రెడ్డి వంటి నేతలు పార్టీలో చేరడమని స్పష్టం చేశారు. మహిళా బిల్లును డీలిమిటేషన్‌తో ముడిపెట్టి రాజకీయం చేస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్సీ రమణ, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

# సర్కార్‌కు ఉద్యోగుల ఉసురు తప్పదు!

**జీతభత్యాలు అందక ఉద్యోగుల అవస్థలు**

**ఐదు డీఏలు.. 14 వేల కోట్ల బకాయిలు పెండింగ్**

**86 మంది పెన్షనర్ల మృతికి ప్రభుత్వమే బాధ్యత**

**మహిళా బిల్లుపై బీజేపీ.. కాంగ్రెస్ నాటకాలు**

**టీజీపీఎస్సీ మాజీ సభ్యురాలు సుమిత్రానంద విమర్శ**

**హైదరాబాద్, ఏప్రిల్ 18 (మనసులో మాట):** తెలంగాణలో ఉద్యోగులు.. రిటైర్డ్ ఉద్యోగులను ఇబ్బందుల పాలు చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి వారి ఉసురు తగులుతుందని ఉద్యోగ సంఘాల జేఏసీ మాజీ నేత దేవీ ప్రసాద్ హెచ్చరించారు. శనివారం తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యోగులు.. ఉపాధ్యాయుల కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక హామీలు ఇచ్చిందని.. కానీ ఏ ఒక్క హామీ అమలుకు నోచుకోలేదని ఆరోపించారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా ఉద్యోగులకు 5 డీఏలు పెండింగ్‌లో ఉన్నాయని.. సీపీఎస్ రద్దుపై ఇప్పటి వరకు కమిటీ వేయలేదని విమర్శించారు. ఉద్యోగులకు రావాల్సిన డిజిటల్ హెల్త్ కార్డులు ఏమయ్యాయని ప్రశ్నించారు.

### రూ. 14 వేల కోట్ల బకాయిలు

రిటైర్డ్ ఉద్యోగులు 86 మంది చనిపోయారని.. వారికి చావే పరిష్కారమైందని దేవీ ప్రసాద్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు ఉద్యోగులకు ఇవ్వాల్సిన రూ. 14 వేల కోట్ల బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. రిటైర్డ్ ఉద్యోగులు తమ హక్కుల కోసం హైకోర్టు మెట్లు ఎక్కాల్సిన పరిస్థితి వచ్చిందని మండిపడ్డారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల చనిపోయిన రిటైర్డ్ ఉద్యోగుల కుటుంబాలకు కోటి 20 లక్షల నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులపై ఆంధ్రా పెత్తనం నడుస్తోందని.. ఎక్సైజ్ శాఖలో కమిషనర్ వేధింపులు తాళలేక తెలంగాణ ఉద్యోగి ఆత్మహత్యాయత్నం చేశారని వెల్లడించారు. చంద్రబాబు.. రేవంత్ రెడ్డి మధ్య సోదర బంధం ఉందని.. బీజేపీ రాజకీయంతోనే మహిళా రిజర్వేషన్ల అమలు బిల్లు ఆగిపోయిందని ఆరోపించారు. డీలిమిటేషన్.. మహిళా బిల్లును కావాలనే లింక్ చేశారని విమర్శించారు. టీజీపీఎస్సీ మాజీ సభ్యురాలు సుమిత్రానంద మాట్లాడుతూ.. 30 ఏళ్లుగా మహిళా బిల్లును కాంగ్రెస్.. బీజేపీ అడ్డుకుంటున్నాయని ఆరోపించారు. మహిళా రిజర్వేషన్ల అమలు కావడం బీజేపీకి ఇష్టం లేదని అన్నారు. ఈ మీడియా సమావేశంలో ఉపాధ్యాయ సంఘం మాజీ నాయకులు భుజంగరావు తదితరులు పాల్గొన్నారు.

# కాగితాలకే పరిమితమైన మహిళా చట్టం!

**అమలు చేయకుండా మహిళల వంచన: సాహెరా బాను**

**కొర్రీలతో 2029 వరకు వాయిదా వేయడం దారుణం**

**రాజకీయంగా ఎదగాలనుకునే వారికి తీరని అన్యాయం**

**చిత్తశుద్ధి ఉంటే తక్షణమే కోటాను అమలు చేయాలి**

**లేదంటే మానవ హక్కుల సంఘం పోరాటం తప్పదు**



**హైదరాబాద్, ఏప్రిల్ 18 (మనసులో మాట):** మహిళా రిజర్వేషన్ బిల్లు చట్టంగా మారినప్పటికీ క్షేత్రస్థాయిలో అమలుకు నోచకపోవడంపై మానవ హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ సాహెరా బాను తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ నిర్ణయం తీసుకున్నామని చెబుతూనే.. జనాభా గణన.. నియోజకవర్గాల పునర్విభజన వంటి కొర్రీలతో 2029 వరకు వాయిదా వేయడం మహిళా లోకాన్ని వంచించడమేనని ఆమె విమర్శించారు.

దశాబ్దాల నిరీక్షణ తర్వాత వచ్చిన ఈ చట్టం.. సాంకేతిక కారణాల సాకుతో అమలు కాకపోవడం వల్ల రాజకీయంగా ఎదగాలనుకునే మహిళలకు తీరని అన్యాయం జరుగుతోందని పేర్కొన్నారు. కేవలం ఎన్నికల ప్రచార అస్త్రంగానే మహిళా బిల్లును వాడుకుంటున్నారని ఆరోపించారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే తక్షణమే ఈ కోటాను అమలు చేసి మహిళా సాధికారతకు బాటలు వేయాలని డిమాండ్ చేశారు. మహిళా రిజర్వేషన్ల విషయంలో జరుగుతున్న కాలయాపనపై ప్రభుత్వం పునరాలోచించాలని.. లేనిపక్షంలో మహిళల హక్కుల కోసం మానవ హక్కుల సంఘం పక్షాన పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని డాక్టర్ సాహెరా బాను హెచ్చరించారు.

# పూజ చేస్తుండగా అగ్నిప్రమాదం.. రిటైర్డ్ ప్రిన్సిపాల్ మృతి!

**పూజ గదిలో చీరకు అంటుకున్న నిప్పు**

**భయంతో పరుగులు తీయడంతో మంటల వ్యాప్తి**

**ఫర్నీచర్, కర్టెన్లకు అంటుకున్న అగ్నికీలలు**

**దట్టమైన పొగతో ఊపిరాడక కుప్పకూలిన వృద్ధురాలు**

**బేగంపేట శ్యామ్‌లాల్ ప్రాంతంలో విషాద ఛాయలు**

**హైదరాబాద్, ఏప్రిల్ 18 (మనసులో మాట):** హైదరాబాద్ బేగంపేటలో ఘోర విషాదం చోటుచేసుకుంది. తెల్లవారుజామున పూజ చేస్తూ దీపం వెలిగిస్తుండగా.. ప్రమాదవశాత్తూ చీరకు నిప్పు అంటుకుని రిటైర్డ్ ప్రిన్సిపాల్ విజయలక్ష్మి (62) మరణించారు.

### భయంతో పరుగులు.. పెరిగిన ప్రమాదం

వివరాల్లోకి వెళ్తే.. బేగంపేటలోని శ్యామ్‌లాల్ ప్రాంతానికి చెందిన విజయలక్ష్మి ప్రభుత్వ స్కూల్ ప్రిన్సిపాల్‌గా రిటైర్ అయ్యారు. ప్రస్తుతం ఆమె ఇంట్లో ఒంటరిగానే ఉంటున్నారు. రోజువారీ పూజలో భాగంగా శనివారం తెల్లవారుజామున దీపం వెలిగిస్తుండగా చీరకు నిప్పు అంటుకుంది. దీంతో ఆమె భయంతో ఇంట్లో అటు ఇటు పరుగులు తీయడంతో మంటలు మరింత వ్యాపించాయి. ఇంట్లోని సోఫా, కర్టెన్లు, ఇతర ఫర్నీచర్‌కు కూడా అగ్నికీలలు అంటుకోవడంతో ప్రమాద తీవ్రత పెరిగింది.

### ఊపిరాడక ప్రాణాలు కోల్పోయి..

ఒక్కసారిగా మంటలు వ్యాపించడమే కాకుండా ఇల్లంతా దట్టమైన పొగ నిండిపోవడంతో విజయలక్ష్మి ఊపిరాడక కుప్పకూలిపోయారు. ఇంటి నుంచి పొగలు రావడాన్ని గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు.. ఫైర్ సిబ్బందికి సమాచారం అందించారు. హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పివేశారు. కానీ అప్పటికే విజయలక్ష్మి మృతి చెందినట్లు గుర్తించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# దేశవ్యాప్తంగా మహిళలను ఏకం చేస్తాం

**ఎంపీ లక్ష్మణ్**

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 18 (మనసులో మాట):** రాజ్యాంగ సవరణ బిల్లును వ్యతిరేకించి మహిళల హక్కులను విపక్షాలు కాలరాశాయని బీజేపీ రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్ విమర్శించారు. కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా మహిళలు కదం తొక్కుతున్నారని పేర్కొన్నారు. శనివారం ఢిల్లీలో మీడియాతో మాట్లాడిన ఆయన.. దక్షిణాది ప్రజలు కాంగ్రెస్, ప్రాంతీయ పార్టీలకు బుద్ధి చెప్పడం ఖాయమని అన్నారు. ప్రధాని మోదీకి ఆదరణ పెరుగుతుండటం, బీజేపీ బలోపేతం అవుతుండటాన్ని చూసి ఓర్వలేకే బిల్లును అడ్డుకున్నారని ఆరోపించారు. మహిళలు చట్టసభలకు రాకుండా కుట్రపూరితంగా వ్యవహరించారని లక్ష్మణ్ మండిపడ్డారు. దక్షిణాదికి అన్యాయం జరగదని స్పష్టం చేసినప్పటికీ.. కేవలం సాంకేతిక కారణాలు చూపుతూ మహిళా బిల్లును అడ్డుకున్నారని విమర్శించారు. దేశవ్యాప్తంగా మహిళలను ఏకం చేసి కాంగ్రెస్, విపక్షాలకు వ్యతిరేకంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు. నియోజకవర్గాల పునర్విభజన, 131వ రాజ్యాంగ సవరణ బిల్లుల విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన ప్రతిపాదనలను ఒక్క ఎంపీ కూడా పార్లమెంట్‌లో ప్రస్తావించలేదని లక్ష్మణ్ ఎద్దేవా చేశారు.

# వెట్టిచాకిరీ.. మానవ అక్రమ రవాణాపై ఉమ్మడి పోరు!

## రాష్ట్ర స్థాయి వర్క్‌షాప్‌లో మంత్రి సీతక్క వెల్లడి

**హైదరాబాద్, ఏప్రిల్ 18 (మనసులో మాట):** తెలంగాణ ఉమెన్ సేఫ్టీ వింగ్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'మానవ అక్రమ రవాణా.. వెట్టిచాకిరీ నియంత్రణ' రాష్ట్ర స్థాయి వర్క్‌షాప్‌లో మంత్రి సీతక్క పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వెట్టిచాకిరీ.. మానవ అక్రమ రవాణా వంటి సామాజిక రుగ్మతలను అరికట్టడానికి వివిధ ప్రభుత్వ శాఖల మధ్య పటిష్టమైన సమన్వయం అవసరమని పేర్కొన్నారు. ఈ నేరాలను అడ్డుకునేందుకు సమిష్టిగా స్పందించే వ్యవస్థను మరింత బలోపేతం చేస్తామని స్పష్టం చేశారు.



### ఆర్థిక స్వాతంత్ర్యంతోనే రక్షణ

రాష్ట్రంలో మహిళల ఆర్థిక సాధికారత కోసం మహిళా.. శిశు సంక్షేమ శాఖ చేస్తున్న కృషిని మంత్రి అభినందించారు. ముఖ్యంగా స్వయం సహాయక సంఘాల (ఎస్ హెచ్ జీ) మహిళలకు అందిస్తున్న వడ్డీ లేని రుణాలు వారి ఆర్థిక స్వాతంత్ర్యానికి ఎంతో తోడ్పడుతున్నాయని తెలిపారు. గ్రామాల్లోనే జీవనోపాధి అవకాశాలు కల్పించడం ద్వారా మహిళలు ఎవరిపైనా ఆధారపడకుండా జీవిస్తున్నారని వివరించారు. మహిళలు ఆర్థికంగా బలోపేతం కావడం వల్ల వెట్టిచాకిరీ వంటి దోపిడీలను సమర్థవంతంగా నివారించవచ్చని సీతక్క అభిప్రాయపడ్డారు. గ్రామ స్థాయి నుంచి మహిళలు ధైర్యంగా ఎదుగుతున్నారని.. ఇటువంటి కార్యక్రమాలు వారిలో మరింత స్థైర్యాన్ని నింపుతాయని పేర్కొన్నారు. దోపిడీ లేని తెలంగాణ సమాజం కోసం ప్రభుత్వం నిరంతరం పనిచేస్తుందని ఈ సందర్భంగా మంత్రి పునరుద్ఘాటించారు.

# హక్కుల కోసం ఐటీసీ కార్మికుల పోరు!

## నల్ల బ్యాడ్జీలతో ఐటీసీ అడ్మిన్ బ్లాక్ వద్ద నిరసన

## పెండింగ్ అంశాలు పరిష్కరించాలి

## రూ. 22 వేలకు తగ్గకుండా ఉండాలి

## వైద్య సదుపాయం కల్పించాలని డిమాండ్

**భద్రాచలం, ఏప్రిల్ 18 (మనసులో మాట):** కార్మిక సమస్యలు తక్షణమే పరిష్కరించాలని కోరుతూ కార్మిక జే ఏ సీ ఆధ్వర్యంలో శనివారం ఐ టీ సీ కర్మాగారం అడ్మిన్ బ్లాక్ వద్ద కార్మికులు పెద్ద ఎత్తున నిరసన తెలిపారు. 13వ వేతన ఒప్పందంలోని పెండింగ్ సమస్యలను పరిష్కరించకపోవడంపై కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. 14వ వేతన ఒప్పందం కార్మికులకు ఆమోదయోగ్యంగా ఉండాలని.. వేతనం రూ. 22 వేలకు తగ్గకుండా ఉండాలని డిమాండ్ చేశారు. కార్మికులందరికీ 100 శాతం అపరిమిత వైద్య పథకాన్ని (అన్‌లిమిటెడ్ మెడికల్ స్కీమ్) వర్తింపజేయాలని నినదించారు. అడ్మిన్ బ్లాక్ ప్రాంగణంలో నల్ల బ్యాడ్జీలు ధరించి తమ నిరసనను యాజమాన్యానికి తెలియజేశారు. కార్మికులకు కొత్త క్వార్టర్ల నిర్మాణం చేపట్టాలని.. షటిల్ కోర్టు.. జిమ్ ఏ సీ.. బైక్ స్టాండ్ వంటి సౌకర్యాలు కల్పించాలని కోరారు. అలాగే దీర్ఘకాలికంగా అనారోగ్యంతో ఉన్న (లాంగ్ సిక్) కార్మికుల పిల్లలకు డిపెండెంట్ ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

### యాజమాన్యానికి హెచ్చరిక

ఈ సమస్యలపై యాజమాన్యం తక్షణమే స్పందించాలని జే ఏ సీ నాయకులు కోరారు. లేనిపక్షంలో తాము తీసుకునే తదుపరి నిర్ణయాలకు.. పోరాటాలకు గుర్తింపు సంఘం.. యాజమాన్యమే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కార్మికులు.. కాంట్రాక్టు కార్మిక సంఘం నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రైతు ఖాతాల్లోకి 'భరోసా' పైసలు!

- 20న కాటారం సభలో నిధులు విడుదల చేయనున్న సీఎం
- 45 లక్షల మందికి పైగా రైతులకు చేకూరనున్న లబ్ధి
- రూ. 5,653 కోట్ల నిధుల విడుదలకు రంగం సిద్ధం




**హైదరాబాద్, ఏప్రిల్ 18 (మనసులో మాట):** తెలంగాణ రైతులకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. ప్రతిష్ఠాత్మక 'రైతు భరోసా' పథకం రెండో విడత నిధుల విడుదలకు ముహూర్తం ఖరారైంది. ఈ నిర్ణయంతో రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది రైతులకు పెట్టుబడి సాయం అందనుంది. సీఎం రేవంత్ రెడ్డి రైతు సంక్షేమమే ధ్యేయంగా ఈ కీలక నిర్ణయం తీసుకున్నారు. వానాకాలం సాగుకు అన్నదాతలు సిద్ధమవుతున్న తరుణంలోనే నిధులు విడుదల చేయాలని ప్రభుత్వం నిశ్చయించింది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారంలో ఈ నెల 20న నిర్వహించే భారీ బహిరంగ సభలో ముఖ్యమంత్రి స్వయంగా నిధులను విడుదల చేస్తారు. అక్కడే బటన్ నొక్కి నేరుగా రైతుల బ్యాంక్ ఖాతాల్లోకి నగదును జమ చేయనున్నారు. ఈ విడతలో 45,11,947 మంది రైతులకు ప్రయోజనం చేకూరనుంది. ప్రతి ఎకరాకు రూ. 6,000 చొప్పున పెట్టుబడి సాయం అందుతుంది. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 1.50 కోట్ల ఎకరాలకు ఈ సాయం వర్తించనుంది. ప్రభుత్వం రైతు భరోసా కోసం భారీగా నిధులను వెచ్చిస్తోంది. ఇప్పటికే ప్రభుత్వం రూ. 3,590 కోట్లను రైతుల ఖాతాల్లో విజయవంతంగా జమ చేసింది. 20వ తేదీన మరో రూ. 5,653 కోట్లు జమ కానున్నాయి. మొత్తం మీద 73 లక్షల మంది రైతులకు ఈ పథకం ద్వారా లబ్ధి చేకూరుతుంది. మిగిలిన రైతుల కోసం మూడో విడత నిధులను విడుదల చేయడానికి కూడా ప్రభుత్వం సిద్ధంగా ఉందని ప్రకటించింది.

### రైతన్నలకు ఊరట

విత్తనాలు.. ఎరువులు కొనుగోలు చేసే సమయంలో ఈ నగదు అందడం వల్ల రైతులకు వడ్డీ వ్యాపారుల భారం తప్పుతుంది. నిధులు సకాలంలో అందడం వల్ల అన్నదాతలు సాగు పనులను వేగవంతం చేసే అవకాశం ఉంటుంది. ఎన్నికల హామీలను నెరవేర్చే క్రమంలో రైతు భరోసా నిధుల విడుదలకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోంది. కాటారం సభ వేదికగా జరగనున్న ఈ కార్యక్రమం రాష్ట్ర వ్యవసాయ రంగంలో కొత్త ఉత్సాహాన్ని నింపనుంది.

# భానుడి భగభగ.. బెంబేలెత్తుతున్న తెలంగాణ!

## కెరమెరిలో అత్యధికంగా 44.6 డిగ్రీల ఉష్ణోగ్రత

## నిజామాబాద్, జగిత్యాల జిల్లాల్లోనూ సెగలు

## ఏప్రిల్ నెలాఖరు వరకు కొనసాగనున్న ఎండలు

## ఎల్ నినో ప్రభావంతో పెరుగుతున్న ఉక్కపోత

## అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దని హెచ్చరిక

**హైదరాబాద్, ఏప్రిల్ 18 (మనసులో మాట):** తెలంగాణలో రోజురోజుకీ ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. ఏప్రిల్ చివరి నాటికి ఎండల తీవ్రత మరింత ఎక్కువగా ఉంటుందని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. ఉదయం నుంచే భానుడు భగభగమంటున్నాడు. పనుల కోసం బయటకు వెళ్తున్న ప్రజలు ఎండవేడిమి తట్టుకోలేక అల్లాడిపోతున్నారు. శనివారం కుమురం భీం జిల్లా కేరిమెరిలో అత్యధికంగా 44.6 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. నిజామాబాద్ జిల్లా మెండోరాలో 44.5 డిగ్రీలు.. జగిత్యాల జిల్లా ఎండపల్లిలో 44.4 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదైనట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఎండలు పెరుగుతున్న నేపథ్యంలో చిన్న పిల్లలు.. వృద్ధులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది. అత్యవసరమైతే తప్ప మధ్యాహ్నం వేళ బయటకు రావొద్దని హెచ్చరించింది.

### రాత్రిపూట కూడా తప్పని ఉక్కపోత

ఉదయం నుంచి ఎండ తీవ్రత విపరీతంగా ఉండటమే కాకుండా.. ఉక్కపోత పెరిగి రాత్రిపూట కూడా ఉష్ణోగ్రతలు తగ్గడం లేదు. మార్చి చివరి నుంచి సాధారణం కంటే అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఏప్రిల్ మొదటి వారంలో కొన్ని చోట్ల వర్షాలు కురిసి ఉపశమనం లభించినప్పటికీ.. మళ్లీ ఎండలు ముదిరాయి. ప్రస్తుతం సాధారణం కంటే 3 డిగ్రీల వరకు అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి.

### ఎల్ నినో ప్రభావం

ఈ పరిస్థితులకు ప్రధాన కారణంగా ఎల్ నినో ప్రభావం కనిపిస్తోందని నిపుణులు చెబుతున్నారు. పసిఫిక్ మహాసముద్రంలో ఉష్ణోగ్రతలు 0.5 నుంచి 1 డిగ్రీ పెరగడంతో ఎల్ నినో ప్రభావం ఏర్పడి.. దక్షిణ భారతదేశంపై ఎండల ప్రభావం ఎక్కువగా ఉంటుందని వాతావరణ శాఖ వెల్లడించింది. దీనివల్ల నైరుతి రుతుపవనాలు బలహీనపడి వర్షపాతం తగ్గే అవకాశం ఉంది. వేసవి కాలం మరింత తీవ్రంగా ఉండవచ్చని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. రానున్న మే.. జూన్ నెలల్లో ఎండల తీవ్రత మరింత పెరిగే సూచనలు ఉన్నాయని.. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. అక్కడక్కడా జల్లులు కురిసే అవకాశం ఉన్నా.. ఎండల నుంచి ఉపశమనం లభించడం కష్టమేనని అధికారులు చెబుతున్నారు.

# భూముల మార్కెట్ విలువ పెంపునకు కసరత్తు!

## త్వరలో కొత్త రెవెన్యూ పాలసీ: మంత్రి పొంగులేటి




**హైదరాబాద్, ఏప్రిల్ 18 (మనసులో మాట):** రాష్ట్రంలో భూముల మార్కెట్ విలువలను పెంచేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోందని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఇప్పటి వరకు ధరల పెంపు జరగలేదని.. త్వరలోనే దీనిపై నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. రెవెన్యూ శాఖలో విప్లవాత్మక మార్పుల కోసం కొత్త పాలసీని రూపొందిస్తున్నట్లు వెల్లడించారు. కేబినెట్ విస్తరణపై చర్చ జరుగుతోందని.. అది విడతల వారీగా ఉండే అవకాశం ఉందని పేర్కొన్నారు.

### మ్యాప్‌తో కూడిన రిజిస్ట్రేషన్లు

ధరణి పోర్టల్ సమస్యలను పరిష్కరించేందుకు 'భూ భారతి' పేరుతో కొత్త వ్యవస్థను తీసుకువస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఈ నెల 20వ తేదీ నుంచి భూముల రిజిస్ట్రేషన్లను మ్యాప్‌లతో అనుసంధానం చేస్తూ కొత్త విధానం ప్రారంభిస్తామని చెప్పారు. ఈ విధానం మొదట పాలేరు నియోజకవర్గంలో ప్రారంభం కానుందని వివరించారు. నామినేటెడ్ పోస్టుల భర్తీ ప్రక్రియ కూడా త్వరలోనే పూర్తి చేస్తామని.. ఎండాకాలం ముగిశాక జెడ్ పీ టీ సీ, ఎం పీ టీ సీ ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉందని పేర్కొన్నారు.

### అక్రమాల చిట్టా సిద్ధం

అసైన్డ్ భూములపై వస్తున్న ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించినట్లు పొంగులేటి తెలిపారు. గత బీ ఆర్ ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అక్రమాల చిట్టా సిద్ధమవుతోందని.. సరైన సమయంలో అన్ని విషయాలు బయటపెడతామని హెచ్చరించారు. అసెంబ్లీలో తనపై విపక్షాలు విమర్శలు చేసినప్పుడు తోటి మంత్రులు అండగా నిలిచారని.. సంయమనంతో అన్నింటికీ సమాధానాలు ఇచ్చానని ఆయన గుర్తు చేసుకున్నారు. ఏ శాఖ ఎవరికీ శాశ్వతం కాదని.. బాధ్యతగా పనిచేయడమే ముఖ్యమని మంత్రి వ్యాఖ్యానించారు.

# రియల్ రంగానికి చిరునామా.. హైదరాబాద్!

- టైమ్స్ ప్రాపర్టీ ఎక్స్‌పో ప్రారంభించిన మంత్రి కోమటిరెడ్డి
- రూ. 70 వేల కోట్లతో రోడ్లు, భవనాల అభివృద్ధి
- ఆర్ఆర్ఆర్, ఎలివేటెడ్ కారిడార్లతో రవాణా మెరుగు
- పెట్టుబడిదారులకు ఆకర్షణీయ కేంద్రంగా నగరం
- స్థిరమైన ధరలు.. మెరుగైన మౌలిక సదుపాయాలు



**హైదరాబాద్, ఏప్రిల్ 18 (మనసులో మాట):** హైదరాబాద్ నగరం దేశంలోనే అత్యంత ఆకర్షణీయమైన పెట్టుబడి కేంద్రంగా, రియల్ ఎస్టేట్ రంగానికి ప్రధాన చిరునామాగా వేగంగా ఎదుగుతోందని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. శనివారం నగరంలో నిర్వహించిన టైమ్స్ ప్రాపర్టీ ఎక్స్‌పో 2026 ప్రారంభ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం అభివృద్ధి దిశగా ముందుచూపుతో పనిచేస్తోందని తెలిపారు.

### రూ. 70 వేల కోట్లతో ప్రాజెక్టులు

రాష్ట్రంలో మౌలిక సదుపాయాల విస్తరణపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని మంత్రి వెల్లడించారు. ఇందుకోసం వేల కోట్ల రూపాయల నిధులు కేటాయించినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం రోడ్లు, భవనాల శాఖ పరిధిలో సుమారు 70,000 కోట్ల రూపాయల విలువైన ప్రాజెక్టులు అమలులో ఉన్నాయని వివరించారు. ఈ ప్రాజెక్టుల పూర్తితో రాష్ట్ర ముఖచిత్రం మారిపోతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. రీజినల్ రింగ్ రోడ్ (ఆర్ఆర్ఆర్), రేడియల్ రోడ్లు, గ్రీన్‌ఫీల్డ్ హైవేలు, ఎలివేటెడ్ కారిడార్లు హైదరాబాద్ కనెక్టివిటీని మరింత బలోపేతం చేస్తాయని కోమటిరెడ్డి తెలిపారు. స్థిరమైన ధరలు, మెరుగైన మౌలిక సదుపాయాలు, పెట్టుబడిదారులకు అనుకూల వాతావరణంతో హైదరాబాద్ దేశంలోనే అత్యుత్తమ మార్కెట్‌గా నిలుస్తోందన్నారు. ఈ ప్రదర్శనను నిర్వహిస్తున్న టైమ్స్ ఆఫ్ ఇండియా ప్రతినిధులను, పాల్గొంటున్న సంస్థలను ఆయన అభినందించారు.

# రోడ్డు భద్రతే ప్రాణాలకు రక్ష

## మంత్రి పొన్నం ప్రభాకర్.. మహబూబ్‌నగర్‌లో 'అరైవ్ అలైవ్'



**మహబూబ్‌నగర్, ఏప్రిల్ 18 (మనసులో మాట):** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా మహబూబ్‌నగర్ జిల్లాలో నిర్వహించిన 'అరైవ్ అలైవ్' కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. సహచర మంత్రి వాకిటి శ్రీహరితో కలిసి పలు అభివృద్ధి, అవగాహన కార్యక్రమాలను చేపట్టారు. పంచవటి విద్యాలయంలో చిల్డ్రన్ ట్రాఫిక్ అవేర్‌నెస్ పార్కును ప్రారంభించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ రూల్స్, సిగ్నల్స్, జీబ్రా క్రాసింగ్, స్కూల్.. హాస్పిటల్ జోన్లపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. మహబూబ్‌నగర్ డిగ్రీ కాలేజీ నుంచి పంచవటి విద్యాలయం వరకు హెల్మెట్ వాడకంపై అవగాహన కల్పిస్తూ మంత్రులు బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం రోడ్ సేఫ్టీ అవేర్‌నెస్‌లో భాగంగా హెల్త్ క్యాంప్, ఐ క్యాంప్ ప్రారంభించారు. సీపీఆర్ విధానంపై విద్యార్థులకు, ప్రజలకు అవగాహన కల్పించారు. రోడ్డు నిబంధనలు పాటిస్తాం.. ప్రమాదాలను తగ్గిస్తామంటూ విద్యార్థులతో కలిసి భారీ మానవహారం నిర్వహించారు. రోడ్డు ప్రమాదాల వల్ల కుటుంబాలు పడే ఇబ్బందులు, ఇంటి పెద్దను కోల్పోతే పిల్లలు ఎదుర్కొనే కష్టాలను విద్యార్థులు నృత్యాల ద్వారా ప్రదర్శించి అందరినీ ఆలోచింపజేశారు. భవిష్యత్తులో రోడ్డు నిబంధనలు పాటిస్తామని, ప్రమాదాలు జరగకుండా బాధ్యతగా ఉంటామని విద్యార్థులతో రోడ్ సేఫ్టీ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ దామోదర్ రెడ్డి, ఎమ్మెల్యే చిక్కుడు వంశీ కృష్ణ, మేయర్ మమత, డిప్యూటీ మేయర్ సురేందర్ రెడ్డి పాల్గొన్నారు. రవాణా శాఖ కమిషనర్ ఇలాంబర్తి, ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, మైనారిటీ ఫైనాన్స్ కార్పోరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, జిల్లా కలెక్టర్ పుష్ప గుప్తా, జేటీసీ చంద్రశేఖర్ గౌడ్, ఇతర ముఖ్య నేతలు, అధికారులు హాజరయ్యారు.

# నియంతృత్వానికి చెంపపెట్టు

## దక్షిణాదిపై బీజేపీ కుట్రలను తిప్పికొడతాం: మంత్రి పొన్నం

**మహబూబ్‌నగర్, ఏప్రిల్ 18 (మనసులో మాట):** భారతదేశ ప్రజాస్వామిక వ్యవస్థలో నియంతృత్వానికి తావులేదని లోక్‌సభలో నిరూపితమైందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ప్రజాస్వామ్యాన్ని బలహీనపరచాలని చూసేవారికి నిన్నటి బిల్లు వీగిపోవడం ఒక చెంపపెట్టు లాంటిదని పేర్కొన్నారు. సంఖ్యా బలం ఉందని ఇష్టారీతిన వ్యవహరించడం వల్లే ఈ పరిస్థితి ఎదురైందని, ప్రజాస్వామ్యాన్ని కాపాడిన ఇండియా కూటమి ఎంపీలకు ఆయన అభినందనలు తెలిపారు.

### మహిళా రిజర్వేషన్లపై కాంగ్రెస్ మార్క్

కాంగ్రెస్ పార్టీ పురుషులతో సమానంగా మహిళలకు ఓటు హక్కు కల్పించిందని మంత్రి గుర్తు చేశారు. రాజీవ్ గాంధీ పంచాయతీ రాజ్ చట్టం ద్వారా స్థానిక సంస్థల్లో మహిళా రిజర్వేషన్లు తెచ్చారని.. మహబూబ్‌నగర్ మేయర్ మహిళ అయ్యారంటే అది కాంగ్రెస్ చలవేనని స్పష్టం చేశారు. 44 ఏళ్లుగా బీజేపీకి ఒక్క మహిళా అధ్యక్షురాలు లేకపోవడం ఆ పార్టీ వైఖరికి నిదర్శనమన్నారు. మహిళా బిల్లులో ఎస్సీ, ఎస్టీ, బీసీ సబ్ కోటా ఉండాలన్నదే తమ పార్టీ నిర్ణయమని తెలిపారు. మహిళలపై మొసలి కన్నీరు కారుస్తూ.. దీనిని డీలిమిటేషన్‌తో ముడిపెట్టడం వెనుక దక్షిణాదికి అన్యాయం చేసే కుట్ర దాగి ఉందని మండిపడ్డారు.

### తెలంగాణ ద్రోహులుగా మిగిలిపోతారు

తెలంగాణ విభజనను భారత్ – పాకిస్థాన్ విభజనతో పోల్చిన బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య ఒక దుర్మార్గుడని మంత్రి తీవ్రంగా విమర్శించారు. సభలో రాష్ట్రం అవమానానికి గురవుతుంటే అక్కడే ఉన్న తెలంగాణ బీజేపీ ఎంపీలకు చీము నెత్తురు లేదా అని ప్రశ్నించారు. తేజస్వి వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగించకపోతే కిషన్ రెడ్డి, బండి సంజయ్, డీకే అరుణ రాష్ట్ర ద్రోహులుగా మిగిలిపోతారని హెచ్చరించారు. సీమాంధ్రులు వ్యతిరేకించినా సోనియా గాంధీ ప్రత్యేక రాష్ట్రాన్ని ఇచ్చారని.. తెలంగాణ కోసం తాము కాళ్లు మొక్కాం, పార్లమెంట్‌లో కొట్లాడామని గుర్తు చేశారు.

నిరంకుశత్వంగా వ్యవహరిస్తూ చట్టాన్ని నిర్వీర్యం చేయడం వల్లే బిల్లు వీగిపోయిందని పొన్నం ప్రభాకర్ అన్నారు. డీలిమిటేషన్ పై ఆల్ పార్టీ మీటింగ్ పెట్టి సలహాలు ఎందుకు తీసుకోలేదని ప్రశ్నించారు. రాబోయే ఎన్నికల్లో రిజర్వేషన్లు వచ్చేలా మహిళా బిల్లును విడిగా పెట్టాలని డిమాండ్ చేశారు. రాహుల్ గాంధీ నాయకత్వంలోనే మహిళా రిజర్వేషన్ బిల్లు సంపూర్ణంగా అమలు అవుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. మహిళా సాధికారత దిశగా వెళ్తున్న తెలంగాణ మహిళలు బీజేపీ కుట్రలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు.

# మియాపూర్‌లో చిల్డ్రన్ క్లినిక్ ప్రారంభం

## ప్రారంభించిన మంత్రి దామోదర రాజనర్సింహ



**మియాపూర్, ఏప్రిల్ 18 (మనసులో మాట):** రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ మియాపూర్ లోని మాధవ్ నగర్ లో ప్రణయ చిల్డ్రన్ క్లినిక్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా క్లినిక్ లో ఉన్న ఆధునిక పరికరాలను (ఎక్విప్మెంట్) ఆయన పరిశీలించారు. విద్య, వైద్య రంగాలలో మౌలిక వసతుల కల్పనకు తమ ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి పేర్కొన్నారు. హైదరాబాద్ నగరం దేశంలోనే ఒక హెల్త్ హబ్ గా వేగంగా అభివృద్ధి చెందుతోందని మంత్రి రాజనర్సింహ తెలిపారు. ప్రభుత్వ రంగంలో ఉచితంగా మెరుగైన వైద్యాన్ని ప్రజలకు అందిస్తున్నామని చెప్పారు. ప్రభుత్వ ఆసుపత్రులలో సామాన్యుడికి కూడా అత్యాధునిక వైద్య సేవలు అందుబాటులోకి తీసుకువచ్చేలా సౌకర్యాలను బలోపేతం చేస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, ఆసుపత్రి నిర్వాహకులు డాక్టర్ ప్రణయ, డాక్టర్ కేవీ తేజారెడ్డి పాల్గొన్నారు. సామాన్యులకు అత్యాధునిక వైద్యం అందుబాటులోకి రావడం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు.

# ఆడబిడ్డల పెళ్లికి సర్కార్ భరోసా!

## 22 మందికి కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ



**చేవెళ్ల, ఏప్రిల్ 18:** ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న కుటుంబాలకు గౌరవప్రదమైన వివాహ వేడుకల కోసం ప్రభుత్వం అందిస్తున్న అండ కళ్యాణ లక్ష్మి పథకమని చేవెళ్ల శాసనసభ్యుడు కాలే యాదయ్య అన్నారు. చేవెళ్ల ఎమ్ ఎల్ ఏ క్యాంపు కార్యాలయంలో శనివారం చేవెళ్ల మండలం.. మున్సిపాలిటీకి చెందిన 22 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి.. షాదీ ముబారక్ పథకాల కింద రూ. 22,00,352 విలువైన చెక్కులను పంపిణీ చేశారు.

### పేదల జీవితాల్లో వెలుగులు

ఈ సందర్భంగా కాలే యాదయ్య మాట్లాడుతూ.. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాల ఆడపిల్లల వివాహాలకు ప్రభుత్వం కొండంత అండగా నిలుస్తోందని చెప్పారు. కళ్యాణ లక్ష్మి.. షాదీ ముబారక్ పథకాల ద్వారా పేదల జీవితాల్లో ఆనందం నిండుతోందని వివరించారు. ఆడపిల్లల పెళ్లిళ్లు తల్లిదండ్రులకు భారం కాకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ ఆర్థిక సాయం అందిస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల మున్సిపల్ చైర్మన్ సమత వెంకట్ రెడ్డి.. ప్రజాప్రతినిధులు.. పార్టీ నాయకులు.. కార్యకర్తలు పాల్గొన్నారు. చెక్కులు అందుకున్న లబ్ధిదారులు ప్రభుత్వం తమకు అండగా నిలవడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

# మోడల్ పేపర్ల సాధనే సివిల్స్ విజయ రహస్యం!

**ప్రిలిమ్స్ నెగ్గాలంటే విస్తృత అధ్యయనం.. నిరంతర సాధన తప్పనిసరి**

**బీసీ స్టడీ సర్కిల్ 'సంకల్ప సాధన దీక్ష'లో విజేత ప్రవీణ్ కుమార్ వెల్లడి**




**హైదరాబాద్, ఏప్రిల్ 18 (మనసులో మాట):** సివిల్ సర్వీసెస్ పరీక్షల్లో విజయం సాధించడానికి ప్రిలిమ్స్ తొలిమెట్టని.. ఇందులో వచ్చే ప్రశ్నలను సరిగా అర్థం చేసుకుని సరైన సమాధానం గుర్తించాలంటే విస్తృత అధ్యయనం ఒక్కటే మార్గమని సివిల్స్ విజేత.. డీఎస్పీ దైనంపల్లి ప్రవీణ్ అన్నారు. సిలబస్‌కు అనుగుణంగా పాఠ్యాంశాలను చదవడమే కాకుండా.. వాటిని సక్రమంగా గుర్తుపెట్టుకోవడం.. సరైన సమయంలో గుర్తుకు తెచ్చుకోవడం అత్యంత అవసరమని ఆయన పేర్కొన్నారు. మే 24న జరగబోయే సివిల్స్ ప్రిలిమ్స్ దృష్ట్యా తెలంగాణ రాష్ట్ర బీసీ స్టడీ సర్కిల్ ప్రయోగాత్మకంగా ప్రారంభించిన 'సంకల్ప సాధన దీక్ష' కార్యక్రమంలో భాగంగా శనివారం సైదాబాద్‌లో ఆయన ప్రసంగించారు.

## గమ్యం వైపు అడుగులు

లక్ష్య సాధనలో ఎన్ని ఆటంకాలు ఎదురైనా వాటిని అధిగమించేలా మనల్ని మనం దృఢపరచుకోవాలని ప్రవీణ్ కుమార్ సూచించారు. మనలోని అంతర్గత శక్తులను ప్రేరేపించుకుంటూ గమ్యం వైపు అడుగులు వేయాలని పిలుపునిచ్చారు. నిరంతరం మోడల్ టెస్టులను సాధన చేయడం వల్ల అభ్యర్థుల్లో ఆత్మవిశ్వాసం.. విషయ అవగాహన.. పరీక్షను ఎదుర్కొనే వ్యూహం పెరుగుతాయని తెలిపారు. గ్రూప్ వన్ పోటీ పరీక్షల్లో విజయం సాధించి డీఎస్పీగా ఎంపికై ప్రస్తుతం అకాడమీలో శిక్షణ పొందుతున్న ప్రవీణ్.. సివిల్స్ 2025లోనూ మంచి ర్యాంకు సాధించి యువతకు ఆదర్శంగా నిలిచారు. ప్రిలిమ్స్ పరీక్షల్లో అభ్యర్థులు పాటించాల్సిన వ్యూహం.. ప్రశ్నలను విశ్లేషించే తీరు.. సమయపాలనపై తన అనుభవాలను అభ్యర్థులకు వివరించారు.

## హాల్ మేనేజ్మెంట్ కీలకం

ఈ సందర్భంగా బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ డాక్టర్ మామిడి హరికృష్ణ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉద్యోగాల్లో సివిల్ సర్వీసెస్ శిఖరం వంటిదని.. ఆ కలను సాకారం చేయడంలో స్టడీ సర్కిల్ నాణ్యమైన శిక్షణ ఇస్తోందని చెప్పారు. ప్రిలిమ్స్ అర్హత సాధించడంలో 'ఎగ్జామినేషన్ హాల్ మేనేజ్మెంట్' కీలకమని.. మూడు గంటల పరీక్ష సమయంలో అభ్యర్థులు ఎలాంటి ఆందోళనలు.. సందేహాలు లేకుండా ఆత్మవిశ్వాసంతో ఉండాలని సూచించారు. అడ్డంకులను సాకుగా చూపి డీలా పడకూడదని.. అచంచల విశ్వాసంతో ముందుకు సాగాలని కోరారు. అభ్యర్థులకు అవసరమైన అన్ని రకాల సదుపాయాలు అందిస్తూ.. ప్రతిరోజూ మోడల్ టెస్టులు నిర్వహిస్తూ వారిలో ధైర్యాన్ని నింపుతున్నామని.. విద్యార్థులను మానసిక.. వైజ్ఞానిక.. మేధోపరంగా సంసిద్ధం చేస్తున్నామని హరికృష్ణ వెల్లడించారు.



# పులి బయటకు వస్తే.. పాపాలు బయటపెడతాం!

- కేసీఆర్ జగిత్యాల సభపై మహేష్ కుమార్ గౌడ్ ఫైర్
- కాళేశ్వరంలో 'పులి' ఏం మింగిందో వివరిస్తాం
- బీజేపీ ఎంపీలు 'యాక్సిడెంటల్' లీడర్లు మాత్రమే
- జై శ్రీరామ్ అనకుండా కిషన్ రెడ్డి గెలవగలరా?
- మహిళా బిల్లు ముసుగులో మోదీ సర్కార్ కుట్ర



**హైదరాబాద్, ఏప్రిల్ 18 (మనసులో మాట):** బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ జగిత్యాల సభపై టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. పులి బయటకు వస్తే దాని సంగతి చెబుతామని.. అది ఎన్ని మేకలను, ఆవులను మింగిందో ప్రజల ముందు పెడతామని హెచ్చరించారు. పులి ఆసరా తీసుకుని ఎన్ని బిల్లులు లాభపడ్డాయో కూడా బయటపెడతామని వార్నింగ్ ఇచ్చారు. కాళేశ్వరం ప్రాజెక్టులో పులి ఏం చేసిందో ప్రజలకు వివరిస్తామని.. ఈ నెల 20వ తేదీన అన్ని విషయాలు బయటపెడతామని స్పష్టం చేశారు. శనివారం గాంధీ భవన్‌లో మీడియా సమావేశం నిర్వహించిన మహేష్ గౌడ్.. బీజేపీ నేతలపై మండిపడ్డారు. స్వాతంత్ర్య పోరాటంలో ఆ పార్టీ పాత్రే లేదని ఎద్దేవా చేశారు.

## నిద్రపోతున్న బీజేపీ ఎంపీలు

బీజేపీ ఎంపీలు కేవలం 'యాక్సిడెంటల్ లీడర్లు' మాత్రమేనని.. మతాల మధ్య, కులాల మధ్య చిచ్చు పెట్టడం తప్ప వారికి ఏమీ తెలియదని మహేష్ గౌడ్ విమర్శించారు. కర్ణాటక ఎంపీ తేజస్వి సూర్య తెలంగాణను కించపరిస్తే రాష్ట్ర బీజేపీ ఎంపీలు నిద్రపోతున్నారా అని ప్రశ్నించారు. గత 40 ఏళ్లలో కిషన్ రెడ్డి ఒక్క బీసీ నాయకుడినైనా తయారు చేశారా అని నిలదీశారు. కిషన్ రెడ్డికి సవాల్ విసురుతూ.. 'జై శ్రీరామ్' అనకుండా కేవలం తాను చేసిన అభివృద్ధిపై ప్రచారం చేసుకుని గెలవగలరా అని ప్రశ్నించారు. ఎన్నికలు వస్తేనే కిషన్ రెడ్డికి శ్రీరాముడు గుర్తుకు వస్తారని.. దేవుడి పేరు చెప్పకపోతే బీజేపీకి మనుగడ లేదని విమర్శించారు. తేజస్వి సూర్య ఒక చిన్న పిల్లాడని.. దేవుడి పేరు చెప్పుకుని ఎంపీ అయ్యాడని ఎద్దేవా చేశారు.

## మహిళా బిల్లు ఒక చెంపపెట్టు

మహిళా సాధికారత విషయంలో కాంగ్రెస్.. బీజేపీలకు చాలా తేడా ఉందన్నారు. దేశానికి తొలి మహిళా ప్రధానిని, రాష్ట్రపతిని ఇచ్చింది కాంగ్రెస్ పార్టీయేనని గుర్తు చేశారు. మహిళా బిల్లు ముసుగులో మోదీ ప్రభుత్వం డీలిమిటేషన్ చేయాలని కుట్ర చేస్తోందని ఆరోపించారు. అక్రమంగా బిల్లు పాస్ చేయాలని చూశారని.. ఈ బిల్లు వీగిపోవడం ప్రధాని మోదీకి చెంపపెట్టు అని విమర్శించారు. ఉత్తర భారతదేశానికి ఎక్కువ సీట్లు ఇచ్చే ప్రయత్నాన్ని విపక్షాలు అడ్డుకున్నాయని.. బీజేపీ నియంతృత్వ పోకడలకు చెక్ పడిందని పేర్కొన్నారు. తెలంగాణలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బీసీ కుల గణన చేపట్టారని.. స్థానిక సంస్థల ఎన్నికల్లో 50 శాతం సీట్లు బీసీలకు ఇచ్చామని తెలిపారు. అత్యధికంగా మహిళా నాయకులను తయారు చేసిన చరిత్ర కాంగ్రెస్ ది మాత్రమేనని మహేష్ గౌడ్ స్పష్టం చేశారు.

# మహిళా బిల్లు అడ్డుకోవడం చారిత్రక తప్పిదం!

- విపక్షాలు మహిళా ద్రోహులుగా మిగిలిపోతారు: కిషన్ రెడ్డి
- దక్షిణాదికి మేలు చేసే ఫార్ములాను అడ్డుకున్నారు
- కాంగ్రెస్ ది మహిళా వ్యతిరేక వైఖరి అని విమర్శ
- జవాబు చెప్పలేకనే ఇండియా కూటమి డ్రామాలు
- మోదీని అవమానించడం విపక్షాల నైజం



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 18 (మనసులో మాట):** నియోజకవర్గాల పునర్విభజన బిల్లు.. మహిళా రిజర్వేషన్ సవరణ బిల్లు పార్లమెంట్‌లో వీగిపోవడం అత్యంత విచారకరమని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. ఈ బిల్లులను అడ్డుకోవడం చారిత్రక తప్పిదమని.. విపక్షాలు మహిళా ద్రోహులుగా చరిత్రలో మిగిలిపోతాయని మండిపడ్డారు. శనివారం ఢిల్లీలో మీడియాతో మాట్లాడిన ఆయన.. ఇండియా కూటమి నేతలపై విమర్శలు గుప్పించారు. ఈ బిల్లులను ఎందుకు వ్యతిరేకిస్తున్నారో ప్రజలకు వివరించడంలో విపక్షాలు విఫలమయ్యాయని ఎద్దేవా చేశారు.

## కాంగ్రెస్‌కు మహిళలంటే చిన్నచూపు

మహిళలకు కాంగ్రెస్ పార్టీ మరోసారి అన్యాయం చేసిందని కిషన్ రెడ్డి విమర్శించారు. గతంలో ఏడు సార్లు ఈ బిల్లు పాస్ కాకుండా అడ్డుకున్న చరిత్ర ఆ పార్టీదని గుర్తు చేశారు. సీట్ల సంఖ్యను 50 శాతం పెంచాల్సిన అవసరం ఉందని తాము అన్ని పార్టీలతో చర్చించామని తెలిపారు. లోక్‌సభలో అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించినా.. ఇండియా కూటమి నేతలు కుట్రపూరితంగా బిల్లులను అడ్డుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది కేవలం ఒక పార్టీకి సంబంధించింది కాదని.. దేశ మహిళల భవిష్యత్తుకు సంబంధించిన అంశమని పేర్కొన్నారు.

## దక్షిణాదికి న్యాయం చేసేలా మోదీ ఫార్ములా

నియోజకవర్గాల పునర్విభజన జరగాలని గతంలో చేసిన చట్టంలోనే ఉందని కిషన్ రెడ్డి వివరించారు. దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరగకుండా ప్రధాని మోదీ ఒక మంచి ఫార్ములాను తీసుకువచ్చారని.. కానీ 131వ రాజ్యాంగ సవరణ బిల్లును అడ్డుకుని కాంగ్రెస్ పెద్ద తప్పు చేసిందని విమర్శించారు. వరుస ఎన్నికల ఓటములతో ఆ పార్టీలో నిరాశ.. నిస్పృహలు కనిపిస్తున్నాయని ఎద్దేవా చేశారు. రాజకీయాల్లోకి రావాలనుకునే మహిళల ఉత్సాహంపై విపక్షాలు నీళ్లు చల్లాయని ఆవేదన వ్యక్తం చేశారు.

## రాహుల్ గాంధీ తీరుపై మండిపాటు

సర్జికల్ స్ట్రైక్స్.. ఆపరేషన్ సింధు వంటి అంశాలను అవమానించేలా రాహుల్ గాంధీ మాట్లాడటం దారుణమని కిషన్ రెడ్డి మండిపడ్డారు. ప్రధాని మోదీని 'జాదూగర్' అంటూ కించపరచడం కాంగ్రెస్ దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమని ధ్వజమెత్తారు. దేశ ప్రయోజనాల కంటే రాజకీయ స్వార్థమే విపక్షాలకు ముఖ్యమని ఈ ఘటనతో మరోసారి రుజువైందని విమర్శించారు.

# రేవంత్ ను హరీష్ ఓర్వలేకపోతున్నారు

- దక్షిణాది ఐక్యతను జీర్ణించుకోలేక విమర్శలు
- లోక్‌సభలో బీఆర్ఎస్‌కు సున్నా బలం
- బయ్యారం ఉక్కు కోసమే కేంద్రంతో భేటీ
- తేజస్వి సూర్యపై స్పీకర్‌కు ఫిర్యాదు
- కేసీఆర్ ఫామ్ హౌస్‌కే పరిమితం కావాలి



**హైదరాబాద్, ఏప్రిల్ 18 (మనసులో మాట):** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దక్షిణ భారతదేశ ప్రజలను ఏకం చేస్తుంటే.. ఆ విషయాన్ని హరీష్ రావు జీర్ణించుకోలేకపోతున్నారని భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి విమర్శించారు. మీ నాయకుడు ఫామ్ హౌస్‌కు పరిమితం అయ్యారని.. లోక్‌సభలో బీఆర్ఎస్ కు ఒక్క ఎంపీ కూడా లేరని హరీష్ రావును ఎద్దేవా చేశారు. శనివారం మీడియా సమావేశంలో మాట్లాడిన చామల.. హరీష్ రావు చేస్తున్న వ్యాఖ్యలపై ఘాటుగా స్పందించారు.

### కేంద్రంతో భేటీపై స్పష్టత

కేంద్ర మంత్రులు భూపతి రాజు శ్రీనివాస వర్మ, కుమారస్వామిలను రేవంత్ రెడ్డి కలిసింది బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటు కోసమేనని చామల స్పష్టం చేశారు. దీనిని కూడా హరీష్ రావు తప్పుబట్టడం సిగ్గుచేటన్నారు. తెలంగాణలో కాంగ్రెస్‌ను ఓడించేందుకు బీఆర్ఎస్ లోపాయికారీ ఒప్పందం చేసుకుని ఎనిమిది మంది బీజేపీ ఎంపీలను గెలిపించిందని ఆరోపించారు.

### తేజస్వి సూర్య వ్యాఖ్యలపై ఫిర్యాదు

తెలంగాణపై బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య చేసిన అనుచిత వ్యాఖ్యలపై తాము ఇప్పటికే స్పందించామని చామల తెలిపారు. తాను స్వయంగా స్పీకర్‌ను కలిసి ఆ వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగించాలని డిమాండ్ చేసినట్లు వెల్లడించారు. పార్లమెంట్ లోపల తాము నిరసన తెలిపామని.. స్పీకర్‌కు ఫిర్యాదు చేశామని చెప్పారు. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా కొనసాగాలని.. కేసీఆర్ ఎప్పటికీ ఫామ్ హౌస్‌కే పరిమితం కావాలని రాష్ట్ర ప్రజలు కోరుకుంటున్నారని చామల వ్యాఖ్యానించారు.

# మహిళా బిల్లు ముసుగులో డీలిమిటేషన్!

## దక్షిణాదిని దెబ్బతీసే కుట్ర విఫలం
## బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధ్వజం
## పార్లమెంట్‌లో మా ప్రాధాన్యత తగ్గించొద్దు
## 24 శాతం ప్రాతినిధ్యంపై తగ్గేదే లేదు

**హైదరాబాద్, ఏప్రిల్ 18 (మనసులో మాట):** నియోజకవర్గాల పునర్విభజన కోసం కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న తీరు పార్లమెంట్‌లో దక్షిణ భారతదేశ ప్రాధాన్యతను తగ్గిస్తోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. మహిళా రిజర్వేషన్ బిల్లును పార్లమెంటు ఇప్పటికే 2023లో ఆమోదించిందని.. ఆ బిల్లుకు పునర్విభజన ప్రక్రియతో ముడిపెట్టాల్సిన అవసరమే లేదని స్పష్టం చేశారు. పునర్విభజనకు 2011 జనాభా లెక్కలను తీసుకున్నా.. తాజా జనాభా గణనను ప్రాతిపదికగా తీసుకున్నా దక్షిణాది రాష్ట్రాలు తీవ్రంగా నష్టపోతాయని ఆవేదన వ్యక్తం చేశారు.



### కుట్రపూరిత రాజ్యాంగ సవరణ

రాజ్యాంగ సవరణకు అవసరమైన మూడింట రెండు వంతుల మెజార్టీ రాదని స్పష్టంగా తెలిసినప్పటికీ.. మోదీ ప్రభుత్వం కావాలనే బిల్లును ప్రవేశపెట్టిందని కేటీఆర్ విమర్శించారు. పార్లమెంటులో దక్షిణాది గళాన్ని అణచివేస్తున్న తీరుపై బీఆర్ఎస్ తరపున తీవ్ర ఆందోళన.. నిరసన వ్యక్తం చేశారు. మహిళా రిజర్వేషన్లకు సంబంధించిన బిల్లు ఇప్పటికే ఆమోదం పొందింది కాబట్టి.. దేశ మహిళలకు ఇచ్చిన వాగ్దానాన్ని తక్షణమే నెరవేర్చాలని డిమాండ్ చేశారు.

### తగ్గిస్తే తిరుగుబాటు తప్పదు

మహిళా కోటాను ప్రస్తుతం ఉన్న 543 స్థానాలతోనే అమలు చేయవచ్చని కేటీఆర్ సూచించారు. పార్లమెంటులో దక్షిణాదికి ప్రస్తుతం 24 శాతం ప్రాతినిధ్యం ఉందని.. ఆ వాటాను యథాతథంగా కొనసాగించాలని పట్టుబట్టారు. ఒకవేళ దక్షిణాది ప్రాధాన్యతను 24 శాతం కంటే తగ్గిస్తే.. దేశ నిర్మాణంలో విశేష కృషి చేసిన దక్షిణాది ప్రజల నుంచి తీవ్రమైన నిరసనలు.. ఆగ్రహం వ్యక్తం అవుతాయని హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వం తన మొండి వైఖరిని వీడాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

# మల్కాజిగిరి వక్ఫ్ చిక్కుముడి.. ఎమ్మెల్యేకు వినతి!

## మంత్రి శ్రీధర్ బాబుతో చర్చించిన ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్
## త్వరలోనే శాశ్వత పరిష్కారం చూపిస్తామని హామీ



**మల్కాజిగిరి, ఏప్రిల్ 18 (మనసులో మాట):** మల్కాజిగిరి నియోజకవర్గ పరిధిలోని పలు కాలనీలకు సంబంధించిన వక్ఫ్ బోర్డు సమస్యపై ప్రభావిత ప్రాంతాల కాలనీ సంఘాల ప్రతినిధులు శనివారం ఉదయం ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డిని కలిశారు. ఆయన కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో తమ ఆస్తుల క్రయవిక్రయాలు నిలిచిపోవడం వల్ల ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించారు.

### పొరపాటు ఎక్కడ జరిగింది?

2024లో తెలంగాణ వక్ఫ్ బోర్డు మల్కాజిగిరి పరిధిలోని సర్వే నంబర్లు 3, 103, 104, 105, 144 నుంచి 154 వరకు 22-ఏ నిషేధిత ఆస్తుల జాబితాలో చేర్చింది. దీనివల్ల న్యూ విద్యానగర్, ఓల్డ్ నేరెడ్మెట్, రాంబ్రహ్మనగర్, దేవినగర్ ఎక్స్టెన్షన్, దేవినగర్, సైనిక్ నగర్, సీతారాం నగర్, కృష్ణా నగర్ వంటి ప్రాంతాల్లో ఆస్తుల కొనుగోలు.. అమ్మకాలు పూర్తిగా నిలిచిపోయాయి. అయితే గత గెజెట్ నోటిఫికేషన్లు.. హైకోర్టు ఉత్తర్వుల ప్రకారం ఇవి మల్కాజిగిరికి కాకుండా ఉప్పల్ మండలం మల్లాపూర్ గ్రామానికి చెందిన సర్వే నంబర్లుగా స్పష్టమైంది. కాలనీ వాసుల ఆందోళనపై స్పందించిన రాజశేఖర్ రెడ్డి.. ఇప్పటికే రెండు సార్లు వక్ఫ్ బోర్డు చైర్మన్.. సీఈఓలను కలిసి మాట్లాడినట్లు తెలిపారు. మల్లాపూర్ భూములు పొరపాటున మల్కాజిగిరి జాబితాలో చేరాయని.. వాటిని తొలగించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఇటీవల మంత్రి శ్రీధర్ బాబును కలిసి పరిస్థితి వివరించానని.. ఆయన కూడా వక్ఫ్ బోర్డు అధికారులతో మాట్లాడారని వెల్లడించారు. త్వరలోనే ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ప్రజలకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వివిధ కాలనీల ప్రతినిధులు.. ఆస్తి యజమానులు పాల్గొన్నారు

# మహిళల భద్రతకు అండగా ‘షీ’ టీమ్!

## విద్యార్థినులకు సైబర్ నేరాలపై అవగాహన
## సైబర్ మోసాలకు గురైతే 1930కు సమాచారం
## టీ-సేఫ్ యాప్ వాడకంపై పోలీసుల సూచనలు




**కొడంగల్, ఏప్రిల్ 18 (మనసులో మాట):** మహిళల భద్రత కోసమే షీ టీమ్ నిరంతరం పనిచేస్తుందని పరిగి సబ్ డివిజన్ షీ టీమ్ ఇంచార్జ్ నర్సింహులు తెలిపారు. శనివారం కొడంగల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గర్ల్స్ హాస్టల్‌లో జిల్లా ఎస్ పీ స్నేహ మెహ్రా.. పరిగి డీ ఎస్ పీ శ్రీనివాస్ ఆదేశాల మేరకు విద్యార్థినులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సింహులు మాట్లాడుతూ.. మహిళలు.. బాలికలు అత్యవసర పరిస్థితుల్లో పోలీస్ శాఖ ద్వారా ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నంబర్లు 100.. 181ను సంప్రదించాలని కోరారు. మొబైల్ వాడకం దారులు సైబర్ క్రైమ్ మోసాలకు గురైనట్లు గుర్తిస్తే వెంటనే టోల్ ఫ్రీ నంబర్ 1930కు సమాచారం ఇవ్వాలన్నారు. మహిళలు.. బాలికలు మొబైల్‌లో టీ-సేఫ్ యాప్ యాక్టివేట్ చేసుకోవాలని సూచించారు. ప్రధానంగా యాంటీ ర్యాగింగ్.. యాంటీ డ్రగ్స్ యాక్ట్.. రోడ్ సేఫ్టీ.. ట్రాఫిక్ సేఫ్టీ అంశాలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గర్ల్స్ హాస్టల్ వార్డెన్ వరలక్ష్మి.. ఉపాధ్యాయులు.. విద్యార్థినులు.. షీ టీమ్ సభ్యులు సావిత్రి.. శోభ పాల్గొన్నారు.

# అనాథ బాలికలకు పాలిటెక్నిక్ విద్య

## ఉచిత వసతితో కూడిన డిప్లొమా కోర్సులు

**కరీంనగర్, ఏప్రిల్ 18 (మనసులో మాట):** మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని హైదరాబాద్ దుర్గాబాయి దేశముఖ్ ప్రభుత్వ మహిళా టెక్నికల్ శిక్షణ సంస్థలో 2026-27 విద్యా సంవత్సరానికి గానూ మూడు ఏళ్ల పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి ఒక ప్రకటనలో తెలిపారు. తల్లిదండ్రులను కోల్పోయిన అనాథ బాలికలు, అక్రమ రవాణాకు గురైన బాధితులు, దివ్యాంగులైన బాలికలు ఈ కోర్సులకు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. మొత్తం ఆరు విభాగాల్లో 360 సీట్లు అందుబాటులో ఉండగా ప్రతి కోర్సులో 60 సీట్లు కేటాయించారు. ఇందులో సివిల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ ఎలక్ట్రానిక్ ఇంజనీరింగ్ (ఈ ఈ ఈ), కంప్యూటర్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ (ఈ సీ ఈ), సెమీ కండక్టర్ టెక్నాలజీ, లాండ్‌స్కేప్ డిజైన్ వంటి కోర్సులు ఉన్నాయి. మొత్తం సీట్లలో 70 శాతం తల్లిదండ్రులు లేని అనాథ బాలికలకే కేటాయించగా మూడు శాతం సీట్లు దివ్యాంగులకు ప్రత్యేకించారు. అనాథ బాలికలు పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష రాయకపోయినా పర్వాలేదని కనీసం పదో తరగతి ఉత్తీర్ణత సాధించి ఉంటే సరిపోతుందని వివరించారు. ఎంపికైన విద్యార్థినులకు ఉచిత విద్యతో పాటు వసతి సౌకర్యం కూడా కల్పించబడుతుంది. ఆసక్తి గల అభ్యర్థులు కులం, ఆదాయ ధ్రువీకరణ, మరణ ధ్రువీకరణ పత్రం, బోనాఫైడ్ పత్రాలను దరఖాస్తుకు జత చేయాల్సి ఉంటుంది. అయితే అనాథ బాలికలకు కులం, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు అవసరం లేదని స్పష్టం చేశారు. దరఖాస్తు ఫారాలు బాల రక్ష భవన్ లేదా జిల్లా పరిషత్ కార్యాలయంలోని రెండో అంతస్తులో లభిస్తాయని వెల్లడించారు. పూర్తి చేసిన దరఖాస్తులను మే 23, 2026 లోగా సమర్పించాలని జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి కోరారు. వివరాలకు 9490881098 నంబరులో సంప్రదించవచ్చని తెలిపారు.

# ఉద్యమకారుల సెక్రటేరియట్ ముట్టడి

- జూన్ 2 లోపు హామీలు నెరవేర్చాలని అల్టిమేటం
- లేదంటే సీఎం ప్రసంగాన్ని అడ్డుకుంటాం: టీయూఎఫ్
- హైకోర్టు ఉత్తర్వులు ఉన్నా పట్టించుకోని సర్కార్
- వందలాది మంది ఉద్యమకారుల అక్రమ అరెస్ట్
- మంత్రులు.. ఎమ్మెల్యేల ఇళ్ల ముట్టడికి హెచ్చరిక



**ఎల్బీనగర్, ఏప్రిల్ 18 (మనసులో మాట):** తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను జూన్ 2 లోపు అమలు చేయకపోతే ముఖ్యమంత్రి ప్రసంగాన్ని అడ్డుకుంటామని టీయూఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జెనిగె విష్ణువర్ధన్ హెచ్చరించారు. ఉద్యమకారుల పక్షాన ఉంటామని మేనిఫెస్టోలో హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. ఇప్పుడు వినతిపత్రం ఇచ్చేందుకు వెళ్తే అక్రమ అరెస్టులు చేయించడం దారుణమని మండిపడ్డారు. తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో సెక్రటేరియట్‌లోని ప్రిన్సిపల్ సెక్రటరీకి వినతిపత్రం ఇచ్చేందుకు శనివారం వందలాది మంది తరలివచ్చారు.

### కోర్టు ఆదేశించినా నిర్లక్ష్యమే

ఉద్యమకారుల సమస్యలపై ఎనిమిది వారాల్లో స్పందించాలని హైకోర్టు ఉత్తర్వులు ఇచ్చినప్పటికీ ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో ఈ నిరసన చేపట్టారు. ప్రిన్సిపల్ సెక్రటరీని కలిసేందుకు వెళ్తున్న ఉద్యమకారులను పోలీసులు అడ్డుకుని దౌర్జన్యంగా అరెస్ట్ చేశారని విష్ణువర్ధన్ ఆరోపించారు. అరెస్ట్ చేసిన వారిని పంజాగుట్ట, మాసబ్ ట్యాంక్, మెహిదీపట్నం పోలీస్ స్టేషన్లకు తరలించారు. ప్రత్యేక రాష్ట్రం కోసం కొట్లాడిన వారికి అండగా ఉంటామని చెప్పి.. ఇప్పుడు కనీసం వినతిపత్రం కూడా తీసుకోకుండా దాడి చేయడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు.

### ఇళ్ల ముట్టడికి సిద్ధం

జూన్ 2 లోపు హామీలు నెరవేర్చకపోతే రాష్ట్రవ్యాప్తంగా మంత్రులు, ఎమ్మెల్యేల ఇళ్లను ముట్టడిస్తామని ఉద్యమకారులు స్పష్టం చేశారు. వినతిపత్రం ఇచ్చేందుకు కూడా అనుమతించకపోవడాన్ని టీయూఎఫ్ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో టీయూఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కొంతం యాదిరెడ్డి, కార్యనిర్వాక కార్యదర్శి కారింగుల నరేందర్ గౌడ్, కార్యదర్శి డాక్టర్ కృష్ణ కృష్ణారావు, తాడూరి గగన్ కుమార్, జానకి రెడ్డి, కుమారస్వామి, రవీందర్, రమేష్, రామ్, బలరాం కుర్మా, రాజు నాయక్, ప్రకాష్, లక్ష్మణ్, శ్రీనివాస్, ఉడుత గంగాధర్, రంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు ఉపేంద్ర యాదవ్, రాధా, ప్రమీల, వరలక్ష్మి, శ్యామ్, పవన్ కళ్యాణ్, వనజ, పద్మ, అంజలి పాల్గొన్నారు.

# బీజేపీ నేతల ముందస్తు అరెస్ట్

### మహిళా బిల్లును విపక్షాలు అడ్డుకోవడంపై కమలదళం ఆగ్రహం



**ఎల్బీనగర్, ఏప్రిల్ 18 (మనసులో మాట):** పార్లమెంటులో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించే కీలక బిల్లును విపక్షాలు అడ్డుకోవడం పట్ల బీజేపీ నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళల సాధికారతకు దోహదపడే ఈ చారిత్రాత్మక బిల్లును వ్యతిరేకించడం అంటే.. దేశంలోని నారీ శక్తిని.. మాతృమూర్తులను అవమానించడమేనని వారు మండిపడ్డారు. విపక్షాల వైఖరికి నిరసనగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జూబ్లీహిల్స్ నివాసాన్ని ముట్టడించేందుకు బీజేపీ శ్రేణులు సిద్ధమయ్యాయి. ఈ నేపథ్యంలో శాంతిభద్రతల దృష్ట్యా హయత్ నగర్ పోలీసులు ముందస్తు అరెస్టులు చేపట్టారు. హయత్ నగర్ డివిజన్ అధ్యక్షుడు గంగని శ్రీనివాస్.. రంగారెడ్డి అర్బన్ జిల్లా ఎస్ సీ మోర్చా ప్రధాన కార్యదర్శి పారంద మహేష్.. బీజేవైఎం డివిజన్ అధ్యక్షుడు అఖి రెడ్డితో పాటు పలువురు కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారిని హయత్ నగర్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. మహిళా బిల్లు విషయంలో కాంగ్రెస్.. ఇతర విపక్షాల ద్వంద్వ వైఖరిని ప్రజలు గమనిస్తున్నారని ఈ సందర్భంగా నేతలు విమర్శించారు.

# చారిత్రక ఇర్రం మంజిల్ వైభవం మళ్లీ విరియాలి!

### ప్రపంచ వారసత్వ దినోత్సవం సందర్భంగా క్లీన్ డ్రైవ్

**హైదరాబాద్, ఏప్రిల్ 18 (మనసులో మాట):** ప్రపంచ వారసత్వ దినోత్సవం 2026 సందర్భంగా చారిత్రక ఇర్రం మంజిల్ ప్యాలెస్‌లో కులీ కుతుబ్ షా అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (క్యూ క్యూ ఎస్ యూ డీ ఏ) ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఆర్ అండ్ బీ శాఖ, డెక్కన్ ఆర్కైవ్ సహకారంతో ఇక్కడ శుభ్రత కార్యక్రమం, ట్రెజర్ హంట్‌ను చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎమ్ ఏ యూ డీ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జయేష్ రంజన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జయేష్ రంజన్ మాట్లాడుతూ.. ఇర్రం మంజిల్ చారిత్రక ప్రాముఖ్యతను వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టబోయే హెరిటేజ్ పార్ట్నర్ స్కీమ్ కింద ఈ భవనాన్ని సంరక్షించి, వినియోగంలోకి తెస్తామని వెల్లడించారు. శుభ్రత కార్యక్రమంలో పాల్గొన్న 60 మంది వాలంటీర్లను అభినందిస్తూ.. వారిని హెరిటేజ్ అంబాసిడర్లుగా పేర్కొన్నారు. భవిష్యత్తులోనూ వారసత్వ కట్టడాల సంరక్షణలో భాగస్వాములు కావాలని కోరారు. నవాబ్ ఫఖ్ర్ అల్ ముల్క్ 19వ శతాబ్దం చివరలో నిర్మించిన ఈ ప్యాలెస్‌కు 'పరడైస్ మెన్షన్' అని పేరు. పంజాగుట్ట కొండపై ఉన్న ఈ భవనం ఒకప్పుడు వందల గదులు, అందమైన తోటలతో విరాజిల్లేది. స్వాతంత్ర్యం తర్వాత పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్, ఇరిగేషన్, ఆర్ అండ్ బీ శాఖలు ఇక్కడ పనిచేశాయి. ప్రస్తుతం వినియోగంలో లేని ఈ భవనం లోపలి నిర్మాణ వైభవం, విస్తీర్ణం చూసి పాల్గొన్న వారు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. వారసత్వ సంపదను కాపాడుకోవడం భవిష్యత్ తరాల కోసం ఎంతో అవసరమని క్యూ క్యూ ఎస్ యూ డీ ఏ అడ్మినిస్ట్రేటర్ గౌతమి పీ తెలిపారు. ఇందుకోసం అందరూ కలిసి పనిచేయాలని కోరారు. వారసత్వ కట్టడాల పట్ల అవగాహన పెంచేందుకు ప్రతి నెలా నిర్వహించాల్సిన కార్యక్రమాలతో కూడిన వార్షిక క్యాలెండర్‌ను ఈ సందర్భంగా ప్రకటించారు. ఇర్రం మంజిల్ వంటి చారిత్రక కట్టడాలను కాపాడుకోవడం మనందరి బాధ్యత అని పేర్కొన్నారు.

# స్కూళ్ల వద్ద 'పొగ' బంద్..

### ఆపరేషన్ సేఫ్ స్కూల్‌తో పోలీసుల ఉక్కుపాదం!

**హైదరాబాద్, ఏప్రిల్ 18 (మనసులో మాట):** నగరంలోని విద్యాసంస్థల సమీపంలో ఉన్న పాన్ షాపుల లక్ష్యంగా 'ఆపరేషన్ సేఫ్ స్కూల్' పేరిట భారీ తనిఖీలు చేపట్టినట్లు హైదరాబాద్ పోలీసు కమిషనర్ సీపీ సజ్జనార్ తెలిపారు. విద్యాసంస్థల పరిసరాల్లో సిగరెట్లు.. గుట్కాలు.. ఇతర పొగాకు ఉత్పత్తుల విక్రయాలను అరికట్టడమే లక్ష్యంగా ఈ ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సోదాల్లో టాస్క్ ఫోర్స్.. స్పెషల్ టీమ్.. హెచ్ న్యూ విభాగానికి చెందిన సుమారు 5000 మంది సిబ్బంది పాల్గొన్నట్లు ఆయన వెల్లడించారు. పాఠశాలలు.. కళాశాలలకు వంద మీటర్ల పరిధిలో ఉన్న సుమారు 500కు పైగా పాన్ షాపుల్లో పోలీసులు ముమ్మరంగా తనిఖీలు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా పొగాకు ఉత్పత్తులు విక్రయిస్తున్నట్లు గుర్తించి పలువురు నిర్వాహకులపై కేసులు నమోదు చేశారు. విద్యాసంస్థల సమీపంలో పొగాకు ఉత్పత్తులు అమ్మడం చట్టరీత్యా నేరమని.. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని సీపీ సజ్జనార్ హెచ్చరించారు. కొందరు షాపు యజమానుల తీరు మారకపోతే లైసెన్సులు రద్దు చేసే దిశగా చర్యలు ఉంటాయని వార్నింగ్ ఇచ్చారు. స్కూళ్ల పరిసరాలు పొగాకు రహితంగా ఉండాలని స్పష్టం చేశారు. విద్యార్థుల భవిష్యత్తు గురించి తల్లిదండ్రుల నుంచి వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో ఈ దాడులు నిర్వహించినట్లు సీపీ తెలిపారు. పోలీసులు డీకాయ్ ఆపరేషన్ నిర్వహించగా.. విద్యాసంస్థల సమీపంలోనే విద్యార్థులకు పొగాకు ఉత్పత్తులు విక్రయిస్తున్నట్లు ఆధారాలు లభించాయి. సిగరెట్.. పొగాకు వాడకం చివరకు డ్రగ్స్ వైపు మళ్లేలా చేస్తుందని.. అందుకే విద్యార్థుల శ్రేయస్సు దృష్ట్యా ఈ రకమైన తనిఖీలు చేపడుతున్నామని వివరించారు.

### నిషేధిత వస్తువుల సీజ్

నాంపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని రెడ్ హిల్స్ ప్రాంతంలో ఉన్న పలు పాన్ షాపులపై దాడులు చేసి భారీగా గుట్కా ప్యాకెట్లు.. సిగరెట్లను స్వాధీనం చేసుకున్నారు. రాష్ట్రంలో నిషేధించిన పాన్ మసాలాలు.. గుట్కాలు అమ్మేవారిపై నిఘా పెంచామని సీపీ తెలిపారు. లోకల్ ఉత్పత్తులపై బ్రాండెడ్ ముద్రలు వేసి అమ్ముతున్న వాటిని కూడా స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. విద్యార్థుల జీవితాలతో ఆడుకునే వారిని వదిలిపెట్టబోమని.. ఈ తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని వెల్లడించారు.

# డ్రోన్లతో దోమలపై యుద్ధం.. పీర్జాదిగూడలో పిచికారీ!

### మున్సిపల్ అధికారుల డ్రోన్ ఆపరేషన్
### గుర్రపుడెక్క తొలగింపునకు టెండర్ పూర్తి
### అధికారులను అభినందించిన తుంగతుర్తి రవి
### పీర్జాదిగూడ, మేడిపల్లిలో శాశ్వత పరిష్కారానికి వినతి
### త్వరలోనే చెరువుల ప్రక్షాళన పనులు

**మేడ్చల్, ఏప్రిల్ 18 (మనసులో మాట):** మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎమ్ ఎమ్ సీ) పరిధిలోని బోడుప్పల్ సర్కిల్, పీర్జాదిగూడ డివిజన్ చెరువుల్లో మున్సిపల్ అధికారులు డ్రోన్ సహాయంతో దోమల మందు పిచికారీ చేశారు. ఇటీవల దోమల వ్యాప్తి విపరీతంగా పెరగడంతో అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారు. చెరువుల్లో గుర్రపుడెక్కను తొలగించేందుకు టెండర్ ప్రక్రియ పూర్తయ్యిందని.. త్వరలోనే చెరువులను పూర్తిస్థాయిలో శుభ్రపరుస్తామని ఎమ్ ఎమ్ సీ అధికారులు వెల్లడించారు.



### అభినందించిన తుంగతుర్తి రవి

దోమల నివారణకు చొరవ చూపిన ఎమ్ ఎమ్ సీ బోడుప్పల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ఏ శైలజకు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, ఆర్ వీ ఫౌండేషన్ చైర్మన్ తుంగతుర్తి రవి కృతజ్ఞతలు తెలిపారు. పీర్జాదిగూడ, మేడిపల్లి, పర్వతపూర్ ఏరియాల్లో దోమల నివారణకు తాత్కాలిక చర్యలే కాకుండా శాశ్వత పరిష్కారం చూపాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో డీ ఈ జాహ్నవి, ఏ ఈ ఈ మహేష్, ఎంటమాలజిస్ట్ రాంబాబు, ఎస్ ఎఫ్ ఏ నరేష్ పాల్గొన్నారు.